


విద్యుత్ నూతన పాలసీ తీసుకొస్తున్నాం

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: విద్యుత్తుపై ప్రభుత్వం నూతన పాలసీని తీసుకొస్తుందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా ఎన్‌డీఏ కూటమి ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుచానూరు సమీపంలోని ప్రైవేటు హోటల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధికి, ఎన్‌డీఏ కూటమి మధ్య సఖ్యతకు సమీక్ష నిర్వహించామ ఒన్నారు. కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, రూ.10లక్షల కోట్ల అప్పులు ఉన్న పేదవాడి కళ్ళలో ఆనందం చూడాలని కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని అన్ని పంచాయతీలతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీలకు కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీపావళి పండుగతో పాటుగ, ఉచిత సిలిండర్ అందుబాటులోని తీసుకువస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అవనీతి అక్రమాలకు విచారణ జరుగుతోందన్నారు. తల్లిని, చెల్లిని రోడ్డు కీడ్చిన జగన్ లాంటి వ్యక్తిని ఇంతవరకు చూడలేదని దుయ్యబట్టారు. రెవిన్యూ వ్యవస్థను వైసిపి సర్వనాశనం చేసిందన్నారు. కుటుంబ సమస్యను పరిష్కరించుకుని ఆ తరువాత జనం గురించి మాట్లాడు జగన్ అని హితావు పలికారు. జగనన్న కాలనీలలో ఉండలేమన్న వారికి ప్రత్యామ్నాయం చూపించే ప్రయత్నం చేస్తాం అన్నారు. ఎన్డీయే కూటమి నేతలు అంత సమన్వయంతో వెళు తున్నారన్నారు. ఒక్క సత్యవేడులో మాత్రమే కొన్ని విభేదాలు ఉన్నాయన్నారు. డబ్బు ఉండి రోడ్డుకు ఎక్కిన కుటుంబం జగన్ దే డైవర్షన్ పాలిటిక్స్ అని మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, బిజెపి, టిడిపి, జనసేన సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలు

- శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: క్రీడారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉందని, రానున్న రోజుల్లో ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకుల సమావేశంలో సోమవారం ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖామంత్రి సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్వరలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలు ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు.

'తొలి దశలో యాజమాన్యంతోనే మంచి దిగుబడులు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ భాస్కరయ్య

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: వరి పైరు నాటిన 45 రోజులు వరకు మంచి యాజమాన్యం పాటిస్తేనే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. బాలయపల్లి మండలం, పిగిలాం గ్రామంలో రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. మొక్కలు బలంగా ఎదగడానికి అవసరమైన కాంప్లెక్స్, పొటాస్ ఎరువులను దుక్కిలోనే వేయాలని సూచించారు. నాట్లుపై పైనే వేయాలని తెలిపారు. నాటిన తర్వాత చిరు పొట్ట దశ వరకు పొలంలో పలుచగా నీరు పెట్టాలని, దీనివలన పిలకలు అధికంగా వస్తాయని చెప్పారు. పిలకలు పెట్టే దశలో 35-40 కిలోల యూరియా వేస్తే, చీడలు అదుపులో ఉంటాయని చెప్పారు. పంటకు అధికంగా యూరియా వాడకం వలన చీడల బెడద ఎక్కువై దిగుబడును తగ్గుతాయన్నారు. వరిలో కలుపు, చీడల నివారణ గురించి ఏఓ వేణుగోపాల్ రావు వివరించారు. నిమ్మలో కత్తిరింపులు, పూత నియంత్రణ, చీడల నివారణ గురించి ఉద్యాన అధికారి ఆనంద రెడ్డి వివరించారు. పండ్లు, కూరగాయలు, పూల సాగుకు ఉద్యాన శాఖ అందిస్తున్న పథకాల గురించి ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతులతో పాటు మండల వ్యవసాయ అధికారి శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపాల్, వినోద్ కుమార్, పెంచలయ్య, సలీం పాల్గొన్నారు.

చెత్త వేస్తే జరిమానాలు విధించండి



- కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించండి
- నగరపాలక సంస్థ అధికారులకు కమిషనర్ మౌర్య ఆదేశం
- పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: నగరంలోని మురుగు నీటి కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరంలో పారిశుధ్య పనులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అన్ని వినతులను పరిష్కరించాలని అన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నట్లు ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కగా చేపట్టాలని అన్నారు. నగరంలో ఎక్కడైనా చెత్త కనిపిస్తే ఆయా ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు నిర్ణీత సమయంలో సరఫరా చేయాలన్నారు. అలాగే డ్రెయినేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు మట్టి, చెత్త తొలగించే పనులు చేపట్టాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ కాలువల మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని వెటర్నరీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, డిసిపి మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డిఈలు, ఏసిపిలు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

రాత్రి వేళల్లో ఇసుక రవాణా ఆపండి

కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం కొందరికి చుట్టంగా మారిందని, రాత్రిళ్ళు ఇసుక తవ్వకాలకు చెక్ పెడితే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటీయూ సీ, ఐఎఫ్టీయూ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఇసుక విధానంపై పర్యవేక్షణ కొరవ డటంతో సరిహద్దులు దాటుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆరోపిం చారు. రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యని, దొమ్మరపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొని తండ్రీ కొడుకులు మృతి చెందిన సంఘటనను గుర్తు చేశారు. ఆ మృతుల కుటుంబానికి పరిహారంగా రూ.50లక్షలు, రెండెకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాలు ఉదయం 6గ ంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పం చాయతీ కార్యదర్శి, వీఆర్వో, తహశీల్దార్ అను మతితోనే రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, పూర్తి పర్యవేక్షణ ఉండాలని కోరారు. అనంతరం ఆర్డీ వో భానుప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు వైఎస్ మణి, ఐఎఫ్టీ యూ నాయ కులు జాకీర్, సీఐటీయూ నాయకులు గంధం మణి, కుమార్, రంగయ్య, వెంకటేష్, అన్వర్ బాషా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పురపాలక కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జోగి శివకుమార్ మాట్లాడుతూ జీవో నెం.36ను వర్తింపజేయాలన్నారు. కార్మికులకు బెనిఫిట్స్ తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్య లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణంలోని పుచ్చలప ల్లి సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అనంతరం కమిష నర్ వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్ట శంకరయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో

గర్జించిన ప్రజా సంఘాలు

సమస్యలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలి: జేసీ

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 211 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కలెక్టరేట్‌లో నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 211అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు. అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కారం చూపాలని, అలసత్వం వహించరాదని జేసీ శుభం భన్సల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్ దేవేంద్ర రెడ్డి, డీపీవో సుశీల దేవి, డీఆర్‌డీఏ సీడీ శోభన బాబు, డ్వామా పీడీ శ్రీనివాసు లుతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు.

నగరపాలక సంస్థకు 40 వినతులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 40విన తులను వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ప్రజల నుండి వచ్చిన విన తులు ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిష్క రించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

'దాడి చేసిన పోలీసులపై ఫిర్యాదు'

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఈ నెల 26వ తేదీన ఎస్వీయూలోని తారకరామ స్టేడియంలో మ్యూజిక్ కాన్సర్ట్‌కి వెళ్లిన ఇద్దరు వర్సిటీ విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని అఖిల పక్ష విద్యార్థి నాయకులు తిరుపతి జేసీకి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మీడియాతో మాట్లాడుతూ బాధ్యత గల విద్యార్థుల మీద నలుగురు పోలీసులు మృగాలవలె దాడి చేయడం నీచమైన చర్యని, స్టేషన్ ఆవరణంలోనే లాఠీలతో బాదడం సీసీ కెమెరాలో కూడా రికార్డు అయ్యిందని, ముఖ్యంగా రవి నాయక్ అనే కానిస్టేబుల్ బూతులు తిడుతూ విద్యార్థి సంఘాలను దూషిస్తూ మాట్లాడటం బాధాకరమ న్నారు. ఇలాంటి పోలీసుల మీద కఠిన మైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులతో చాకిరీ చేయిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని..

జిల్లాలో సంక్షేమ హాస్టల్లో సమస్యలు రోజురోజుకి తీవ్రమవుతున్నాయి. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నాయుడుపేట బీసీ హాస్టల్లో ఏబిసిడబ్ల్యూవో, వార్డెన్, వంటమనిషి కుమ్మక్కయి నిధులు పక్కదారి మళ్లిస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించకుండా వారి చేత చెత్త ఊడిపించడం, మరుగుదొడ్లు కడిగించడం, నీళ్ల బిందెలు మోపించడంలాంటి పనులు చేస్తున్నారు. వెంటనే ఆ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి కలెక్టరేట్‌లోని సంక్షేమ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, ఆఫీస్ బేరర్స్ అశోక్, వినోద్, తేజ నరేంద్ర, వీరేష్‌లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి..

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతులు, గుర్తింపు, ప్రచారం చేస్తూ, షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండా నడుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో జేసీకి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎంఆర్ పల్లి సర్కిల్లో ఉన్నటువంటి బైక్ షోరూమ్ పైన నడుస్తున్నటువంటి నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కళాశాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతులు లేకపోయినా తరగతులు నిర్వహిస్తున్నారని జేసీకి వివరించారు.

'దీవెన' ఇవ్వండి!

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-నాయుడుపేట: గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో నష్టపోయిన విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకొని ప్రస్తుత ప్రభుత్వం వసతి దీవెన, విద్యా దీవెనకు సంబంధించి రూ.3480కోట్లు నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు భరత్ రవి, మనోజ్, ప్రవీణ్, శివకేశవ ఆధ్వర్యంలో ఎంపిడివోకు వినతి పత్రం అందజేశారు.

'బీడు భూములను పేదలకు పంచండి'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కేవిబి పురం మండలంలోని కర్లపూడి గ్రామంలో ఉన్న మేత బీడు భూములను పేదలకు పంచాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటేష్, నారాయణరెడ్డి, చెంచయ్య, చంగాలయ్య, పెద్దమక్కయ్య, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కేవీబీ పురంలో

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వెంకటగిరిలో

ప్రజాశక్తి-వెంకటగిరి: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను చేపట్టారు. వెంకటగిరిలో సీఐటీయూ కార్యవర్గ సభ్యులు వడ్డీపల్లి చంగయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు.



నాయుడుపేటలో

నాయుడుపేట: నాయుడుపేట మండల కేంద్రంలో మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎంఈవోకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ, వనమ్మ, మల్లికా, వెంకటేశ్వర్లు, మణి, రజియా తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం కార్మికులు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం నిరసనకు దిగారు. సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద ఆధ్వర్యంలో ఎంఈవో శైలజకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జయమ్మ, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఓజిలిలో

అయ్యోర్ల ప్రమోషన్ షెడ్యూల్ విడుదల

- యూటీఎఫ్ హర్షం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రాష్ట్రంలోని మున్సిపల్ పాఠ శాలల్లో ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్ పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయ డానికి రాష్ట్ర విద్యాశాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర యుటిఎఫ్ శాఖ దశల వారీగా పోరాటాలకు పిలుపునివ్వడం, ఆ ప్రకారంగా యుటిఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు చేసిన పోరాట ఫలితమే ఈ జీవోనని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వా నికి విద్యాశాఖ డైరెక్టర్‌కి మున్సిపల్ ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపల్ మేనేజ్మెంట్‌లోని సీనియర్ హెచ్ఎంలకు మండల విద్యాశాఖ అధికారి పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్ లోని సీనియర్ ప్రధాన ఉపాధ్యాయులకు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులు ఇవ్వాలని యుటిఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్వీయూకు రూ.10లక్షల విరాళం



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలో దూరవిద్య ద్వారా మనోవిజ్ఞాన శాస్త్రం అభ్యసించి, అమెరికాలోని చికాగోలో వుంటున్న ఫ్రీ లైన్స్ జర్నలిస్టు, ఇండియా ట్రిబ్యూన్ పత్రిక మాజీ ఎడిటర్ జెవి లక్ష్మణరావు వారి తల్లిదండ్రుల పేరున దూరవిద్య శాఖలో తరగతి గది కోసం రూ.10లక్షల విరాళపు చెక్కును ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతినాయుడులకు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ఇంజనీర్ తాండవ కృష్ణ, డిడిఇ డైరెక్టర్ ఆచార్య తవమణి, డిఆర్ సునీత, దయసాగర్, డిడిఈ భాస్కర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా ప్రమాణాలకు నిలయం 'స్కిమ్స్'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉన్నత విద్యా ప్రమాణాలకు నిలయం స్కిమ్స్ ఎంబీఏ, ఎంసీఏ కళాశాల అని ఆ కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి అన్నారు. స్థానిక కళాశాలలో 2024-25 విద్యా సంవత్సర ఎంబీఏ, ఎంసీఏ తరగతులను సోమవారం ప్రారంభించారు. కళాశాల మిషన్, విజన్, కోడ్ ఆఫ్ కాండక్ట్, భౌతిక సౌకర్యాలైన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్మెంట్ సెల్, ప్లే గ్రౌండ్, కోర్స్ కరికులంల గురించి వక్తలు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ గీతాదేవి, శ్రీ కుమార్, రఘురాం రెడ్డి, కోకో కోల హెచ్‌ఆర్ టి.ఎల్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బిసీఎం పాఠశాల విద్యార్థులను అభినందించిన జెసి



విద్యార్థులను అభినందిస్తున్న జెసి బన్సల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని, రాణించాలని తెలుపుతూ బిసిఎం పాఠశాల క్రీడా ఆణిముత్యాలను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అభినందించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో మంగళం స్థానిక బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ క్రీడాకారులు మర్యాద పూర్వకంగా తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిశారు. జంప్ రోప్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఇలాగే క్రీడల్లో ముందుకు సాగాలని మరెన్నో విజయాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి గౌరవాన్ని ప్రతిష్టతను పెంచేలా ప్రతిభ కనబరచాలని కోరారు. అంతేకాకుండా విద్యార్థులను ప్రోత్సహిస్తూ మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిల వరకు ప్రోత్సహించిన బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ (బిసీఎం) పాఠశాల కరస్పాండెంట్ ప్రియాను, వ్యాయామ ఉపాధ్యాయు రాలు ప్రమీనను జెసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఎన్డీసి దేవేంద్ర రెడ్డి, డిఆర్డిఎ పిడి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కూటమి సర్దుపోటు!

- వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారం
- వచ్చే నెల నుంచి యూనిట్‌కు రూ.1.21పైసల పెంపు
- 15నెలల పాటు అదనపు భారమే
- సర్దుబాటు పేరుతో అదనపు వడ్డన
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

ప్రజాశక్తి-డక్కిలి: విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారులను ప్రభుత్వాలు దొంగ దెబ్బ తీస్తున్నాయి. పరోక్షవడ్డింపులతో సామాన్యులు తల్లడిల్లుతున్నారు. విద్యుత్ బిల్లులు చూస్తేనే షాక్‌కు గురవుతున్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు చార్జీల బాదుడు తీవ్రతకు వామ్మో అనాల్సిందే. ఎడా పెడా వేస్తున్న సర్దుబాటు ఛార్జీలు మరింత భారంగా మారుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఒకేసారి మూడు సర్దుబాటు చార్జీలను వినియోగదారులపై భారం వేసింది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు తోడు, విద్యుత్ బిల్లులు మరింత కుంగదీస్తున్నాయని పేద, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. మళ్లీ ఎప్పుడో వచ్చిన నష్టాలను బూచిగా చూపి ఇప్పుడు సర్దుబాటు చార్జీల పేరిట ప్రజల నుంచి రాబ ట్టేందుకు రంగం సిద్ధం అయింది. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమంటూ కూటమి నేతలు ప్రజలకు భరోసా కల్పించారు. అయితే సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు చర్యలు తీసుకోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. టారిఫ్‌తో సంబంధం లేదు. శ్లాబ్ రేట్లతో అసలే సంబంధం లేదు. ఎవరు ఎన్ని యూనిట్లు వాడుకున్నారనేది కూడా వాళ్లకు అనవసరం. వినియోగదారులు ఎన్ని యూనిట్లు వాడుకుంటే అన్ని యూనిట్లకు శ్లాబ్ రేట్ ప్రకారం బిల్లు చెల్లించడంతో పాటు ప్రతీ యూనిట్‌కు అదనంగా మరికొంత చెల్లించాలి. గత ప్రభుత్వ హయాంలో 2022-23 సంవత్సరంలో జరిగిన కొనుగోలు నష్టాలను సాకుగా చూపి ఆ వ్యయాన్ని సంస్థ వినియోగదారులపై సర్దుబాటు పేరుతో వేసేందుకు నిర్ణయించుకుంది. ప్రతి నెలా వస్తున్న విద్యుత్తు బిల్లులో వచ్చే నెల నుంచి యూనిట్‌కు రూ.1.21 పైసల అదనపు ఛార్జీల రూపంలో వసూలు చేసుకు నేందుకు ఈఆర్‌సి విద్యుత్ సంస్థకు అనుమతి చ్చింది. ఈ సర్దుబాటు చార్జీలు 15నెలల వరకు వినియోగదారులు భరించాల్సి ఉంది. పెరుగుతున్న నిత్యవసర ధరలతో కుటుంబాన్ని నెట్టుకురాలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటంబాల వారు ఇప్పటికే వస్తున్న విద్యుత్ బిల్లులను చూసి గగ్గోలు పెడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1744432 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 1251424 కనెక్షన్లు గృహావసరాలకు సంబంధించినవి. మిగిలినవి పరిశ్రమలు, వ్యవసాయ, వీధి దీపాలు, తాగునీటి పథకాల కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినెల జిల్లా వాసులు తమ గృహ అవసరాల కోసం సరాసరి 110 యూనిట్లు వంతున వినియోగిస్తే 13,76,56,640 యూనిట్లు వాడుతారు. యూనిట్ కు అదనంగా రూ. 1.21 పైసలు సర్దుబాటు చార్జీలువల్ల ప్రతినెల ఉమ్మడి చిత్తూరు జిల్లాపై రూ.16.65 కోట్లు అదనపుభారం పడనుందని ప్రజాసంఘాల నాయ కులు చెబుతున్నారు. ఇక వెంకటగిరి ట్రాన్స్ కో సబ్ డివిజన్ పరిధిలో వెంకట గిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో మొత్తం 66149 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 43886 గృహ విద్యుత్ కనెక్షన్లు కాగా మిగిలినవి వ్యవసాయ వీధి దీపాలు చిన్న తరహా పరిశ్రమలు మొదలగునవి. గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్న 43876మంది సరాసరి నెలకు 110 యూనిట్ల వంతున వినియోగిస్తే 48,26,360 యూనిట్లు వాడుతారు. యూనిట్‌కు సర్దుబాటు చార్జీల రూపంలో అదనంగా రూ.1.21 వంతున ప్రతి నెల రూ 58.39లక్షలు భారం పడనుంది. ఈ సర్దుబాటు చార్జీలు నవంబర్ నెల నుంచి అమల్లోకి రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్దుబాటు, ఇంధనఖర్చులు తదితర పేర్లతో విద్యుత్ చార్జీలు భారీగా పెంచింది. విద్యుత్ ఛార్జీలు పెరుగుదలపై పేద, మధ్యతరగతి ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయింది. ఆసమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమంటూ ఎన్నికల్లో పెద్ద ఎత్తుకూటమి నేతలు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారు. సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచేందుకు ఈఆర్‌సీ అనుమతించడంతో వినియో గదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి సర్దుబాటు చార్జీ లు నిలుపుదల చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పారిశుద్ధ్య కార్మికులకు టపాకాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజల్లో మరింత వెలుగులు నింపాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు దీపావళి పండగ ప్రతీక అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రజలు కుల, మత, వర్గ భేదాలు విడిచి దీపావళి పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. సోమవారం ఉదయం 40,41వ డివిజన్లలో పనిచేసే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు జనసేన నాయకుడు హరిశంకర్ ఏర్పాటు చేసిన టపాకాయలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. ప్రతికూల పరిస్థితులు ఈ దీపావళి తొలగి ప్రజలకు నూతన వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ లో భాగంగా టపాకాయలను కాల్చడాన్ని తగ్గించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రమణ రెడ్డి, సుబ్బారావు, రమణ పాల్గొన్నారు.

కుక్కంబాకం దళితులకు పట్టాలి ఇవ్వాలి: సిపిఎం



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబాకం రెవెన్యూలోని సర్వే నంబర్ 81లో 82 ఎకరాల 80 సెంట్ల ప్రభుత్వ భూమిలో స్థానిక దళితులకు పట్టాలు ఇవ్వాలని తహశీల్దార్ ఐ సుబ్రహ్మణ్యంకు కుక్కంబాకం దళితుల ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత జనార్ధన్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం 'ఫెయిర్ అడంగల్'లో తక భూములుగా (ప్రభుత్వ భూములుగా) రికార్డుల్లో ఉండగా కొందరు భూస్వాములు పట్టా భూములుగా క్లైమ్ చేసుకొని పోలీసులను రెవెన్యూ వారిని ఉపయోగించుకొని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వ రికార్డులను తారుమారు చేయకుండా తహశీల్దారు రికార్డుల్లో ఉన్నది ఉన్నట్లు పై అధికారులకు తెలపాలని కోరారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేయాలని చూస్తే కలెక్టరుకు, రెవెన్యూ సిసిఎల్ఎ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని అవసరమైతే అధికారులపై చర్యలు తీసుకునే వరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రమణయ్య, బాలగురవయ్య, తిరుపాలు, చెంకురవయ్య, కుక్కంబాకం దళితులు జెకె రమణయ్య, దయాకర్, కృష్ణయ్య, శంకరయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

పోలీసుల రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసు శాఖ స్థానిక ఎంజీఎం ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆ శాఖ సిబ్బంది, ఎస్ఐలు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డిఎస్పి నరసింహమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు అమరుల త్యాగానికి ప్రతీకగా శ్రీకాళహస్తి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా వుందన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. శిబిరం జయప్రదానికి కృషి చేసిన ఎంజీఎం ఆస్పత్రి యాజమాన్యానికి, పోలీసులు, యువకుల ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రుల డైరెక్టర్ గుడ్డూరు మయూర్, సిబ్బంది గోపి, వెంకటేశులు, రవి నాయక్, తిమ్మయ్య పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగ: బిఎన్ కండ్రిగ సిఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఎన్ కండ్రిగ ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది నరేష్, సురేష్, రంగా, వరమని, అరుణ్, హరి, బాలకృష్ణ ప్రభాకర్ రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న బిఎన్ కండ్రిగ పోలీసులు

ఎంపిడివోకు సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నాగలాపురం ఎంపిడీవోగా బాధ్యతలు స్వీకరించిన బాలాజీ నాయక్, సురుటుపల్లి పంచాయతీ నూతన కార్యదర్శి యూసఫ్ ఖాన్, సురుటుపల్లి పంచాయతీ టిడిపి యూనిట్ ఇన్‌చార్జి పిసి రుద్రయ్య, మాజీ గ్రామ అధ్యక్షులు ఎం మనోజ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానని తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సురుటుపల్లి పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల కన్నా సురుటుపల్లి పంచాయతీని ప్రథమ స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: టిడిపి సభ్యత్వ నమోదును ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకటే మాధవులు నాయుడు స్వగ్రామం గోవర్ధనగిరిలోని స్వగృహంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. మాజీ ఎఎంసీ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఇళంగోవన్ రెడ్డి, మాజీ ఎఎంసీ వైస్ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్ రెడ్డితో పాటు రాష్ట్రపతి అవార్డు గ్రహీత మాజీ సర్పంచ్ పద్మ రాజు, నర్సింహులు మనోహర్, సతీష్ నాయుడు, నాయకులు రవీంద్ర నాయుడు, ఎంఎస్ రవి, విజయ్ కుమార్ నాయుడు, కొల్లపురి రెడ్డి, కరీవర్దన్, శరవణ, గోపి, పద్మనాభ నాయుడు పాల్గొన్నారు.

కోట: టిడిపి సభ్యత్వాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఉధృతంగా చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎడిసిసి బ్యాంక్ వైస్ ఛైర్మన్, టిడిపి నేత నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి కోరారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం కోట మండలం, పుచ్చలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దొరువు కట్ల గ్రామం లో టిడిపి కార్యకర్తలతో కలిసి టిడిపి నేతలు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పాదార్తి కోటేశ్వరరెడ్డి లు ప్రారంభించారు.



పద్మజకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుచానూరు గ్రామ నివాసి, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధక విద్యార్థి డాక్టర్ అన్నామలై యూనివర్సిటీ పరీక్షల విభాగం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. చిదంబరంలోని అన్నామలై యూనివర్సిటీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో "ఎమెర్జింగ్ పార్టిసిపేషన్ ఇన్ ఫ్యామిలీ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ అవార్డును ప్రదానం చేశారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధక జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలు ప్రచురించారు. పద్మజకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

'విజయానికి వ్యక్తిత్వ వికాసం అవసరం'

ప్రజాశక్తి - క్యాంపస్: విజయ సాధనకు వ్యక్తిత్వ వికాసం అవసరమని డాక్టర్ కె రాణి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని క్యాంపస్ లోని ధృతి మల్టీపర్పస్ హాల్ లో సోమవారం నిర్వహించారు. డాక్టర్ కె రాణి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తమ విద్యార్థి దశ నుంచే గుర్తించి కలిగిన నైపుణ్యాలను పెంపొందించుకుంటూ తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమ రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బండి రుక్మిణి క్యాంపస్ లో ఉండగానే ఏవిధంగా ఉద్యోగాన్ని సంపాదించు కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రీతి, సుచరిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో అభివృద్ధికి శ్రీకారం: జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: గ్రామాల అభివృద్ధికోసం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన కార్యక్రమం అని జెడ్‌పిటిసి కోనేటి సుమన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం నారాయణవనం ఎంపిడీఓ దివాకర్ రెడ్డి తో కలిసి నారాయణవనం ఎంపిడీఓ కార్యాలయంలో జనరల్ బాడీ సభలో పాల్గొని ప్రసంగించారు. జడ్పిటీసి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పనులను సిసి రోడ్లు, సిసి డ్రైనేజీలు, కల్వర్టులు, గ్రావెల్, తారు రోడ్లు నిర్మాణం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు, పశువుల కుంటలు, పూడిక తీత పనులు, పాడి రైతులకు అవసరమైన పశువుల షెడ్లు, ప్రజలకు తాగునీరు విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పన కు కావలసిన పనులను గుర్తించి గ్రామ సభలో తీర్మానం చేస్తారన్నారు.

మొక్కలు పేరిట నిధుల దుర్వినియోగం

వైసిపి ప్రభుత్వ హయాంలో అవినీతి



ప్రజాశక్తి -చిట్టమూరు: రోడ్డుకు ఇరువైపులా మొక్కల నాటే కార్యక్రమంలో రూ.లక్షకు పైగా నిధుల అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రలోభాలకు గురి చేస్తూ ఐదు నెలలు నుంచి సొమ్మును కట్టకుండా కాలయాపన చేస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. మొక్కలు పెంచడంతో పాటు, పేదల జీవనోపాధి మెరుగుపరచడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డ్వామా) ద్వారా చేపట్టిన మొక్కల పెంపకానికి అవినీతి మరక అంటుకుంది.

చిట్టమూరు మండలం ఉప్పలమర్తి గ్రామంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకి ఇరువైపులా (అవెన్యూ) మొక్కల నాటారు. వీటి కోసం వేతనాలు, సామగ్రి రూపంలో రూ.లక్షకు పైగా సొమ్మును ఏపీవో పక్కదారి పట్టించినట్లు అప్పట్లో గుర్తించారు. ఈ తంతు అంతా వైసిపి ప్రభుత్వంలో చోటుచేసుకుంది. ఈ సొమ్మును ఐదు నెలలు అవుతున్నా బాధ్యుని నుంచి రికవరీ చేయలేదు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏ పొరపాట్లు చేయని ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వైసిపి కార్యకర్తలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా చేర్చారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే వారి విధుల్లో వారు మళ్లీ చేరడంతో అది నచ్చక ఏపీఓ ప్రలోభాలకు గురి చేస్తున్నాడనే ఆరోపణలు వున్నాయి. దుర్వినియోగం చేసిన సొమ్మని తిరిగి చెల్లించకుండా వైసిపి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆఫీసుకు పిలిపించి 'మీరు కట్టండి నేను మీకు సపోర్ట్ చేస్తాను.. మళ్లీ మీరే విధుల్లోకి చేరేలా నేను చేస్తాను..' అని వారికి హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సమాచారం మండల టిడిపి నాయకులకు చేరడంతో వారు మీడియాతో మాట్లాడుతూ అప్పటి వైసిపి ప్రభుత్వంలో ఈ దుర్వినియోగానికి ఏపీవో పాల్పడ్డారని దుర్వినియోగ సొమ్మును చెలించకుండా ఇలాంటి పనులు చేయడం ఏమిటని, వైసిపి నాయకులకు ఇకనైనా కొమ్ముకాయడం మానుకోవాలని వారు కోరుతున్నారు.

రాష్ట్ర చెకుముకి పోటీలకు 'జీవీఎస్' విద్యార్థులు



రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన జీవీఎస్ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టుటౌన్‌లోని జీవీఎస్ పాఠశాలల విద్యార్థులు జెవివి ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన జిల్లా చెకుముకి పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా జెవివి ప్రతినిధులు మాట్లా డుతూ సైన్స్‌పై అవగాహన కలిగించేందుకు, మూఢ నమ్మకాల నిర్మూలనకు గత 34 సంవత్సరాలుగా చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయిలో మొదటి బహుమతి, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించిన జీవీఎస్ శంకరయ్య మెమోరియల్ హైస్కూల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పోటీలలోనూ చక్కటి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షిం చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్‌పై అవగాహన కలిగిం చేందుకు జన విజ్ఞాన వేదిక వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయ మన్నారు. విద్యార్థులను ప్రోత్సహిం చిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదా లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాము, ఉపాధ్యాయులు మల్లికార్జున, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు చెంచు నారాయణ, ప్రభాకర్, సుమన్ రెడ్డి, రజనీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు: టిటిడి ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని టిటిడి ఈవో జె శ్యామలరావు అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో, తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం సమావేశం మందిరంలో సోమవారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష నిర్వహించారు.

ముని ప్రదీప్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని బొక్కశంపాలెం గ్రామానికి చెందిన నాగలాపురం వెంకటసుబ్బయ్య, రమాదేవిల కుమారుడు డాక్టర్ నాగలాపురం ముని ప్రదీప్ కి ఐఐటి వారణాసి యూనివర్సిటీ లో సివిల్ ఇంజనీరింగ్ లో డాక్టరేట్‌ను ఐఐటీ యూనివర్సిటీ డైరెక్టర్ అమిత్ పత్ర చేతులు మీదగా బహూకరించారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా సోమవారం గ్రామంలోని ప్రజలు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో కావలి శివకుమార్, గ్రామస్థులు వున్నారు.

గ్రామీణ పేదలకు భూ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి చిత్తూరు జిల్లాలలో ఉన్న మండలాలలోని గ్రామాల్లో ఉన్న భూమిలేని పేదలందరికి అధికారులు భూ పంపిణీ చేసి ఉపాధి అవకాశాలను కల్పించాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను గుర్తించి భూమి పంపిణీ చేయాలని అధికారులకు వినతి పత్రాలను ఇచ్చామన్నారు. పాకాల మండలంలో అటవీ సరిహద్దు ప్రాంతాలలో అడవి పందుల దాటికి వ్యవసాయాన్ని చేస్తూ అక్కడి స్థానిక రైతులు తీవ్ర నష్టపోతున్నారన్నారు. ఈ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఉమామహేష్, గోపి, చంద్ర పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించి కేసులు పెట్టారు..

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 'మా భూమిని కాపాడాలని అధికారులకు వినతి పత్రాలు ఇస్తే మాపైనే కేసులు పెట్టారు...' తమిళనాడుకు చెందిన ఎసిపి జీవనందన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు నగిరి పట్టణ వాస్తవ్యులైన మాకు తిరుచానూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 255/1బి1లో 72 సెంట్ల భూమి కలిగి ఉన్నామన్నారు. ఎంతో కాలంగా మా స్వాధీన అనుభవంలో ఉన్న స్థలాన్ని విశ్రాంత పోలీసు అధికారి భాస్కర్ నాయుడు తప్పుడు పత్రాలను సృష్టించి 21 సెంట్ల భూమిని ఆక్రమించి దౌర్జన్యంగా వ్యవహరిస్తూ తన అనుచరులతో భూమిని చదును చేయడంతో కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో పొందామన్నారు. కోర్టు ఆర్డరును పట్టించుకోకుండా మద్యం దుకాణం ఏర్పాటు చేశారన్నారు. దీనిపై అధికారులకు వినతులు ఇస్తే సంబంధం లేని వ్యక్తులను కలిపి ఎంఆర్‌పల్లి పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. జిల్లా ఉన్నతాదికారులు స్పందించి ఈ దౌర్జన్యంను అడ్డుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు బాలక్రిష్ణమ నాయుడు పాల్గొన్నారు.

మానసిక రోగులు హాస్పిటల్‌కు తరలింపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మానసిక రోగుల రహిత పట్టణాలగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా 'మనోబంధు ఫౌండేషన్' ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాళహస్తి, తిరుపతి నగరానికి సంబంధించి వివిధ ప్రాంతాల్లో మానసిక రోగులు ఐదుగురిని గుర్తించి కడపలోని మానసిక హాస్పిటల్ కి తరలించారు. కుటుంబాలను వదిలిపెట్టి, పట్టణాలలో నీళ్ల తాగుతూ, పాచిపోయిన అన్నం తింటూ తిరగాడుతున్న, ఐదు గురు మానసిక రోగులను గుర్తించి, ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా అనంతపురం, కడప, తిరుపతి లాంటి ప్రాంతాలకు చెందిన సుమారు 20 మంది మానసిక రోగులను కూడా అడ్మిట్ చేయడంతో వాళ్లు ప్రస్తుతం అదే కడప హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారని గుర్తు చేశారు. ఇది ఒక సామాజిక కార్యక్రమ ఉద్యమంగా మనోబంధు ఫౌండేషన్ ఛైర్మన్ రామకృష్ణమరాజు ఎంతో నిబద్ధతతో, బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని రిపబ్లికన్ పార్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి.శివారెడ్డి మనోబంధు రీజనల్ కోఆర్డినేటర్ విజయబాబు, ముని చంద్ర శ్రీకాళహస్తి ఏరియా మనోబంధు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత విధానం అమలు చేయాలి

ఎల్ఐసి ఏజెంట్లు నిరసన



పుత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎల్ఐసి కొత్త విధానాన్ని రద్దుచేసి, పాత విధానం అమలు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్లు గత నెల తమకు అన్యాయం ఎదురైందని నిరసిస్తూ పుత్తూరు ఎల్ఐసి బ్రాంచి కార్యాలయ ఆవరణలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్, యూనియన్ కార్యదర్శి ఎ రుద్రమోహన్ మాట్లాడుతూ 68 సంవత్సరాలుగా ఎల్ఐసి ఏజెంట్లు, తమ వృత్తిని దేశంలో గ్రామ గ్రామాన విస్తరింపజేసి నమ్మకంతో 40 కోట్లకు పైగా పాలసీ దారులు, 60 లక్షల కోట్లకు పైగా మూలధనంతో ప్రపంచంలో రెండవ స్థానం ఆక్రమించడంలో ఏజెంట్ల పాత్ర ఎంతో వుందన్నారు. 14 లక్షల మందికి పైగా ఏజెంట్లు, 68 సంవత్సరాలుగా ఒకే కమీషన్‌తో పని చేస్తున్నారని, ఒక్క రూపాయి పెరగలేదన్నారు. అలాంటిది ప్రస్తుతం ఐఆర్‌డిఎ పేరుతో మొదటి సంవత్సరం కమీషన్ తగ్గించడం అమానుషం అన్నారు. పాలసీ దారులకు బోనస్ పెరగడం లేదని, పాలసీ దారులు లోన్ తీసుకుంటే, వారి డబ్బులకు 10 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారన్నారు. లోను వడ్డీ ఆలస్యమైతే దానికి విపరీతంగా జీఎస్టీ వసూలు చేస్తున్నారని దీనిపై అంతా మార్పు రావాలని, గతంలాగే, ఎల్ఐసి కొనసాగాలని లేకుంటే దేశ వ్యాప్తంగా తమ నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే ఎం సుందరం, సుబ్రహ్మణ్యం, సురేష్ మునిరాజ, పిఆర్‌సి నాయుడు, దేవరాజులు, శివ, లోక, శ్రీనివాస నాయుడు, భాగ్యలక్ష్మి, బాలు, వెంకటేష్, బుజ్జి, ఢిల్లీ, బాబు, హేమ, షణ్ముగం, కేశవర్ధనయ్య, మణిరాజు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం శ్రీకాళహస్తి ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఏజెంట్లు సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అక్టోబర్ ఒకటవ తేదీ నుండి భోజన విరామ సమయంలో ఎల్ఐసి ఏజెంట్లు నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ మేనేజ్మెంట్ ఏజెంట్లు సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో ముందుకు రాని నేపథ్యంలో నిరసనకు దిగినట్లు నెల్లూరు డివిజన్ జనరల్ సెక్రటరీ జీ సతీష్ బాబు అన్నారు. పాలసీలపై జిఎస్టి ను రద్దు చేయాలనీ, పాలసీదారులకు ఇచ్చే బోనస్ ను పెంచాలనీ, ఏజెంట్ల కమీషను చెల్లింపులో పాత పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎల్ఐసి బ్రాంచ్ ఏజెంట్ల కార్యవర్గ ప్రసిడెంట్ ఎస్ నారాయణ స్వామి, కార్యదర్శి వై బాబురావు, ట్రెజరర్ కూనాటి ఈశ్వర్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తిరుపతి రూయ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ హరిత తన సిబ్బందితో కలిసి ఈ శిబిరం ఏర్పాటు చేశారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ నేతృత్వంలో 29మంది టాస్క్ ఫోర్సు ఉద్యోగులు రక్తదానం చేశారు. . ఈ సందర్భంగా ఎస్పీ పీ శ్రీనివాస్ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలోకి కొత్తరక్తం చేరడంతో. ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు . ఆపదలో ఉన్న వారికి ఈ రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రక్తదానం చేసిన వారిలో డీఎస్పీ జి. బాలిరెడ్డి, ఆర్ఐ కే.సురేష్ కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

భలే మంచి 'పంచెల' వ్యాపారం

- శివయ్య సన్నిధిలో 'సంప్రదాయ' దోపిడీ!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయ అధికారులు సాంప్రదాయమంటూ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు కొందరు వ్యాపారులకు వరంగా మారాయి. సాధ్య సాధ్యాలను పరిశీలించకుండా అనుకున్నదే తడవుగా దేవస్థానం అధికారులు నిర్ణయాలు అమలు చేసేస్తుండడంతో వ్యాపారులు బాగానే లాభ పడుతున్నారు. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దోపిడీకి గురవుతున్నారు. రాహు కేతు పూజల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని దేవస్థానం అధికారులు నిబంధన పెట్టారు. ఇది శ్రీకాళహస్తి పట్టణంలోని కొందరు వ్యాపారులకు వరంగా మారి పోయింది. తెల్లవారు జామున బస్సుల్లో, రైళ్లలో, వివిధ వాహనాల్లో ఆలయానికి వచ్చే భక్తులను కొందరు వ్యాపారులు రోడ్లపై అడ్డగించి నిలువు దోపిడీ చేస్తున్నారు. రాహు కేతు పూజ చేయించు కోవాలంటే తప్పనిసరిగా పురుషులు పంచలు ధరించాలనీ, ఫ్యాంట్లు ధరించి వెళ్లకూడదని భయపెడుతున్నారు. అంతేగాకుండా పురుషుల ప్యాంట్లను తొలగించి బలవంతంగా పంచెలను వాళ్లే కట్టేస్తున్నారు. కొందరు మహిళ వ్యాపారాలు కూడా ఈ పని చేస్తుండడంతో పురుష భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు రూ.200 విలువచేసే పంచను రూ.500 రూపాయలకు అంట గట్టేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పూజల నిబంధనలు తెలియక భక్తులు వ్యాపారులతో మోసపోతున్నారు.పట్టణంలోని తేరువీధిలో ఉన్న కొందరు వ్యాపారులు మూడు పువ్వులు ఆరు కాయలుగా లాభాల పంట పండించు కుంటున్నారు. భిక్షాల గాలి గోపురం, శివయ్య గోపురం ద్వారా వచ్చే భక్తులు దోపిడీకి గురవతున్నారు. స్వామి, అమ్మవార్ల అర్ధ మండపం దర్శనానికి, అభిషేకాలకు మాత్రమే సంప్రదాయ వస్త్రధారణ నిబంధన ఉంది. దీనిని సక్రమంగా అమలు చేయలేని అధికారులు రాహుకేతు పూజ మండపాల్లో కూడా సంప్రదాయ వస్త్ర నిబంధన అమలు చేస్తున్నారు. దీనివల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అధికారులు, సిబ్బంది తీరు వల్ల మన స్థానానికి గురవుతున్నారు. ఈ విధానం ఇలాగే కొనసాగితే రాహుకేతు పూజలు ఆగిపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పడిపోయే ప్రమాదం కూడా పొంచి ఉంది. సోమవారం కూడా సంప్రదాయ దుస్తుల్లో రాలేదని సెక్యూరిటీ సిబ్బంది కొందరు భక్తులను అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో భక్తులు తీవ్ర నిరాశతో ఇంటి బాట పట్టారు. ఈ విషయం అధికార పార్టీ నేతకు తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. అధికారుల తీరు ఇలాగే ఉంటే రాహుకేతు క్షేత్రం పేరు గతం గతః కానుంది. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ఆదాయానికి గండి పడే ప్రమాదం ఏర్పడింది. ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకోకుంటే భక్తుల రాక తగ్గిపోయే పరిస్థితి ఎదురు కానుంది.

తల్లిదండ్రుల సమాధిని కూల్చారు..

మహిళా న్యాయవాది ఆవేదన

ప్రజాశక్తి -వెంకటగిరి: దశాబ్దాల క్రితం కొనుగోలు చేసుకున్న తమ సొంత భూమిలో నిర్మించిన తల్లిదండ్రుల సమాధిని కూల్చారని వెంకటగిరికి చెందిన మహిళా న్యాయవాది లత ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న చిన్న పిల్లల పార్కులో సోమవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. తన తండ్రి సింగరేసి నరసయ్య బతికి ఉన్న సమయంలో ఆయన కొనుగోలు చేసిన స్థలంలో ఆయన కాలం చేసిన తర్వాత తాము సమాధి నిర్మించినట్లు చెప్పారు. తమ స్థలం పక్కనే ఉన్న ఇతరుల స్థలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రూ.6 కోట్లకు అన్ని ఆ స్థలాలకు దారి లేనందు వల్ల తమకు చెందిన స్థలాన్ని ఆక్రమించే క్రమంలో సమాజంలో కూలగొట్టారని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారని తెలిపారు. తన కుటుంబాన్ని మానసిక క్షోభకు గురిచేసిన ఆక్రమణదారులు సమాధులను ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేవరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

క్రైం న్యూస్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 36 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున 3 లక్షల 60 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి 36 మంది నిందితులను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు వెల్లడించారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు అధిక మోతాదులో మద్యం సేవించి ఆటో నడిపిన ఇద్దరికి మూడు రోజులు జైలు శిక్ష, మద్యం సేవించి టు వీలర్ నడిపిన నలుగురికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యత తో విధులు నిర్వర్తించాలని ట్రాఫిక్ పోలీసులకు పలు సూచనలు చేశారు.

మోటూరు సైకిల్ ఢీ

వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పుత్తూరు మున్సిపాల్టీ భావాని నగర్‌కు చెందిన ఎం సుబ్రహ్మణ్యం రెడ్డి పెయింట్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం లేవగానే కూలి పనికి వెళ్లి సాయంత్రం తిరిగి తిరుపతి– చెన్నై హైవే జాతీయ రహదారిపై కాలి నడక ఇంటికి బయలుదేరాడు. కొండల్ చెరువు సమీపంలో తొర్రూరు గ్రామానికి చెందిన మణికంఠ పుత్తూరు నుంచి తొర్రూరు గ్రామానికి మోటార్ సైకిల్ పై వెళుతూ అదుపు తప్పి సుబ్రహ్మణ్యం రెడ్డిని వెనుకనుండి ఢీకొన్నాడు. అక్కడికక్కడే పడిపోవడంతో అతని తలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పరిశీలించి వెంటనే 108కు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యం రెడ్డిని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రూయా హాస్పిటల్‌కి తరలించారు. మార్గం మధ్యంలోనే పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏఎస్ఐ కె భాస్కర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు మోసగాళ్లు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎస్‌బిఐ తిరుపతి బ్యాంకులో నకిలీ భూమి డాక్యుమెంట్లు చూపి లోను తీసుకుని బ్యాంకును మోసం చేసిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు క్రైమ్ డిఎస్పి రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుల అప్పు ఎగవేత కేసులో ఆలస్యం లేకుండా మోసగాళ్లను పట్టుకోవాలన్న ఎస్‌పి సుబ్బారాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ ఎస్‌పి నాగభూషణం పర్యవేక్షణలో డిఎస్‌పి రవికుమార్ ఆధ్వర్యంలో క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డామన్నారు. ప్రణాళికా బద్ధమైన నిఘాతో నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుండి ఇప్పటి వరకు మొత్తం 9 లక్షలు రూపాయలు స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసులో మరి కొందరిని అరెస్టు చేయాల్సి వుందన్నారు. నిందితులు కడియాల రామారావ్, అన్నపురెడ్డి శ్రీనివాసరావు, కంచుపాటి బ్రహ్మయ్య, ముగ్గురు కలసి వారి సహచరులు అన్నపురెడ్డి హరినారాయణ ఇతరులతో కలసి, ఫోర్జరీ చేసిన భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తయారు చేశారన్నారు. ముందస్తు పథకంలో భాగంగా ఎస్‌బిఐ తిరుపతి న్యూ బాలాజీ కాలనీ బ్రాంచ్‌ను మోసం చేసి బ్యాంకు నుండి రూ.2 కోట్ల 80 లక్షల రూపాయలు అప్పుగా తీసుకుని, అప్పు ఎగవేత చేసినట్లు పోలీసుల విచారణలో ప్రాథమిక తెలిసిందన్నారు. దీంతో వారిపై నిఘా వుంచి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మరి కొంత మందిని త్వరలో అరెస్టు చేస్తామని వెల్లడించారు. ఈ కేసు ఛేదనలో విశేష ప్రతిభ చూపిన తిరుపతి క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు చిన్న పెద్దయ్య, ప్రకాష్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పురుషోత్తం, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, వినాయకం, రామకృష్ణని ఎస్‌పి సుబ్బరాయుడు అభినందించారని క్రైమ్ డిఎస్పి రవి కుమార్ తెలిపారు.

ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయండి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి టిడిపి నాయకుల వినతి



ఇన్‌ఛార్జి మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పిచ్చాటూరు టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై వెంటనే సస్పెన్షన్ ఎత్తి వేయాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్ రెడ్డి తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యప్రసాద్‌ను ఇళంగోవన్ రెడ్డి ఆధ్వర్యంలో పిచ్చాటూరు మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సస్పెన్షన్‌లో వుండడం వల్ల తమలాంటి నాయకులతో పాటు పార్టీ క్యాడర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు సైతం ఆగిపోతున్నాయని మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జయచంద్ర నాయుడు, పద్దు రాజు, బుజ్జి నాయుడు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు అండర్ 14 ఉమ్మడి చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి కోకో క్రీడల పోటీల సందర్భంగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడాదుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, శేషమ నాయుడు, కృష్ణయ్య యాదవ్, విద్యాకమిటీ రంగయ్య, ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'షర్మిలను విమర్శిస్తే భవిష్యత్తు లేదు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కాంగ్రెస్ ఏపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను విమర్శిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని, ఈ సారి వచ్చే ఎన్నికల్లో వైకాపాకి 11 సీట్లు కూడా రావని పిసిసి ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, తిరుపతి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టిబాబు స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి వైఎస్ షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని దీన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు రాజకీయ ఉనికి కోసం షర్మిల రెడ్డి గురించి మాట్లాడడం మానుకోవాలన్నారు. తల్లిపై కేసు వేసిన వ్యక్తిగా జగన్ మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.



మంత్రిని కలిసిన హేమంత్ రాయల్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని తిరుపతికి విచ్చేసిన సందర్భంగా విమానాశ్రయంలో టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువ కప్పి ఘన స్వాగతం పలికారు.